సాక్షి అనంతపురం

శుక్రవారం । 26 । జులై । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి.



కిలో టమాట రూ.37

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.37, కనిష్టంగా రూ.20 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం

31.3°/23.6°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 18 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: కౌలుకు భూమి తీసుకొని పంటలు సాగు చేసే రైతులు గుర్తింపు కార్డులు పొందాలని డీఏఓ ఉమా మహేశ్వరమ్మ సూచించారు. గురువారం గార్లదిన్నె వ్యవసాయ శాఖ కార్యాలయంలో, బుక్కరాయసముద్రం మండలంలోని వడియంపేటలో నిర్వహించిన కౌలు రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భూమి వివరాల జిరాక్స్‌లు, ఫొటోలు, దరఖాస్తు ఫారం వీఆర్‌ఓలకు ఇస్తే పంట సాగు హక్కు పత్రాలు అందజేస్తారన్నారు. తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. దీంతో ప్రభుత్వం నుంచి ఎరువులు, విత్తనాలు, పంట నష్ట పరిహారం, తదితర రాయితీలు పొందవచ్చన్నారు. గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు బ్యాంకు లోను మంజూరు చేస్తారన్నారు. అదను దాటిపోయినా ఆందోళన చెందకుండా కొర్ర, జొన్న,పెసలు, ఉలవలు విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరీ, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారులు సోమశేఖర్, శ్యామ్‌సుందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైలు ఇంజిన్ ప్రారంభం



రైలు ఇంజిన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

గుత్తి: స్థానిక రైల్వే డీజిల్‌షెడ్‌లో గురువారం 69114 రైలు ఇంజిన్‌ను గుంతకల్లు డీఆర్‌ఎం విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రైల్వేస్, వ్యాబ్‌టెక్ సౌజన్యంతో గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌కు రైల్వే బోర్డు 250 రైలు ఇంజిన్లను కేటాయించిందన్నారు. ఇందులో ఇప్పటికే 130 ఇంజిన్లు గుత్తి లోకో షెడ్‌కు చేరుకున్నాయన్నారు. త్వరలోనే మిగతావి చేరుతాయని డీఆర్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ప్రమోద్, గుంతకల్లు బ్రాంచ్ ఆఫీసర్లు, వ్యాబ్‌టెక్ సంస్థ ప్రతినిధులు సందీప్, రజనీష్, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే జీఎం పర్యటన

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శుక్రవారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటిస్తున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ముందుగా డివిజన్ పురోగతిపై అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. అనంతరం గుంతకల్లు–డోన్–కాచిగూడ సెక్షన్‌లో ప్రత్యేక రైలులో రైలు మార్గం పరిశీలిస్తారన్నారు. డోన్, కర్నూలు, గద్వాల్, మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేపడతారని వివరించారు.

ఆన్‌లైన్‌లోనూ అర్జీల స్వీకరణ



అనంతపురం అర్బన్: ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఆన్‌లైన్ ద్వారా కూడా అందజేయవచ్చని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ గురువారం తెలిపారు. ఆధార్ నంబరు ఉపయోగించి pgrs.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి సోమవారం గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందన్నారు.

28న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి అర్బన్: స్థానిక వైఎస్సార్ మినీ ఫంక్షన్ హాలులో ఈ నెల 28న జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు న్యూ తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజర్ సాయి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది క్రీడాకారులు సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో తలపడనున్నట్లు అంచనా వేశారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 3, 4 తేదీల్లో తాడిపత్రి వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తిన దృశ్యం

• ఆనంద ప్రవాహం

తుంగభద్ర జలాశయానికి గురువారం కూడా వరద నీరు పోటెత్తాయి. దీంతో జలాశయం 20 క్రస్ట్ గేట్లను ఒక్కటిన్నర అడుగు మేర అధికారులు ఎత్తివేశారు. 44,812 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 7,865 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 97,272 క్యూసెక్కులుగా నమోదవుతుండగా, కాలువలకు వదిలే నీటితో కలిపి అవుట్‌ఫ్లో 49,384 క్యూసెక్కులుగా ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం హెచ్చెల్సీలో ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– బొమ్మనహాళ్

తాగుతూ.. తూలుతూ!

- రాప్తాడుకు చెందిన మల్లికార్జున వారం రోజుల క్రితం భార్యాపిల్లలతో కలిసి బెంగుళూరు హైవేలోని ఓ ధాబాకు వెళ్లారు. అక్కడ పలువురు యువకులు మద్యం తాగుతుండటం చూసి నివ్వెరపోయారు. తాను ధాబాకు వెళ్లానా? బార్‌కా? అన్న సందేహం కలిగింది. ఈ క్రమంలో భార్యాపిల్లలతో వెంటనే అక్కడి నుంచి మల్లికార్జున బయటకు వచ్చేశారు.
- అనంతపురం నగరం నడిబొడ్డున శ్రీకంఠం సర్కిల్ ఉంది. ఇక్కడి ఓ రెస్టారెంటుకు రెండు రోజుల క్రితం నగరానికి చెందిన సునీల్‌కుమార్, మద్దిలేటి అనే ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ కొందరు యువకులు మద్యం తాగుతూ గట్టిగా అరుస్తూ కనిపించారు. రెస్టారెంటు నిర్వాహకులకు ఈ విషయం గురించి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో ఇద్దరూ అక్కడి నుంచి వచ్చేశారు.



- బార్లను తలపిస్తున్న ధాబాలు
- ఇష్టారాజ్యంగా నిర్వాహకులు
- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మద్యం ప్రియులతో నిత్యం కిటకిట
- రాత్రి 12 గంటల వరకూ అందుబాటులో మద్యం
- పట్టించుకోని అధికారులు

రెండు జిల్లాల్లో పరిస్థితి ఇలా..

'అనంతపురం' జిల్లాలో మద్యం దుకాణాలు	127
'శ్రీ సత్యసాయి' జిల్లాలో	65
'అనంతపురం'లో బార్‌లు	19
'శ్రీ సత్యసాయి'లో బార్‌లు	11
ఉమ్మడి జిల్లాలో ధాబాలు	400 వరకూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సాధారణంగా ధాబా హోటళ్లలో ఆహార పదార్థాలు ఉంటాయనుకుంటాం. కానీ జిల్లాలోని పలు ధాబాల్లో వీటితో పాటు మద్యం కూడా కావాల్సినంత లభిస్తోంది. ధాబాల్లో మద్యం లభించడమేమిటని అనుకుంటున్నా ఇది నిజం. నేడు జిల్లాలోని చాలా ధాబాలు బెల్టు షాపులను తలపిస్తున్నాయి. రుచులను ఆస్వాదించాలని ఆయా చోట్లకు వెళ్లిన చాలా కుటుంబాలకు మద్యం ప్రియుల సిట్టింగులు విస్మయానికి గురిచేస్తున్నాయి.

ప్రతి ధాబాలోనూ ఇంతే...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 400 వరకూ చిన్నా పెద్ద ధాబాలున్నాయి. ఇటీవల ఎన్నికల ఫలితాల వరకూ ఇక్కడి పరిస్థితులు మామూలుగానే ఉండేవి. ఫలితాల అనంతరం పరిస్థితి మారిపోయింది. బెల్టు షాపులుగా మారిపోయాయి. 'మందు మీరు తెచ్చుకున్నా సరే, లేకుంటే మా సిబ్బందే సమకూరుస్తారు' అంటున్నారు. బహిరంగంగానే ఈ సౌకర్యం కలిప్తున్నారు. వందల ధాబాలు ఇప్పుడు మినీబార్లుగా మారాయి. రాయదుర్గం, మడకశిర, హిందూపురంలోని ధాబాల్లో అయితే కర్ణాటక మద్యం కూడా అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఆయా ధాబాల్లో మద్యం ప్రియులు వాలిపోతున్నారు. రాత్రి 12 గంటల వరకూ మద్యం లభిస్తోంది. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



నగరంలోని ఓ ధాబాలో మద్యం తాగుతున్న దృశ్యం(ఫైల్)

సెబ్ పోలీసులతో మిలాఖత్!

సెబ్ పోలీసులకు ఏ ధాబాలు ఎక్కడున్నాయి.. ఎక్కడ మద్యం తాగుతున్నారు అనే విషయం తెలుసు. తనిఖీల పేరిట వెళ్లడం, ధాబా నిర్వాహకులతో మాట్లాడుకోవడం, మామూళ్లు తీసుకోవడం నిత్యం జరుగుతున్నదే. ఈ విషయంపై ఎన్నోసార్లు బార్ల యజమానులు సెబ్ పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఎక్సైజ్ అధికారులేమో తమ పరిధిలోకి రాదంటూ తప్పించుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు వరకూ జిల్లాలో ఎక్కడా బహిరంగంగా మద్యం సేవించకుండా, కర్ణాటక నుంచి అక్రమంగా రవాణా కాకుండా ఉక్కుపాదం మోపారు. కానీ, కొత్త ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏరులై పారుతోంది. ధాబాలకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

ధాబాల్లో మద్యం తాగితే కేసులు

ధాబాల్లో మద్యం తాగడానికి వీలు లేదు. తరచూ దాడులు చేస్తున్నాం. ఎక్కడైనా ధాబాల్లో మద్యం సేవిస్తున్నారని తెలిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా డీపీఎల్ (డ్యూటీ పెయిడ్ లిక్కర్)పై దృష్టి సారించాం.

– శ్రీరామ్, డీఎస్పీ, సెబ్

ఆ విషయం మా పరిధిలోకి రాదు

హోటళ్లలో మద్యం తాగడం, అక్రమ మద్యం రవాణా వంటివి మా పరిధిలోకి రావు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పర్యవేక్షిస్తుంది. మా పరిధిలో ఉండే అన్ని విషయాలూ నిబంధనల మేరకు అమలు చేస్తున్నాం.

– మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

జగన్ ఢిల్లీ ధర్నాతో ప్రభుత్వానికి కనువిప్పు

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో నిర్వహించిన ధర్నాతో చంద్రబాబు ప్రభుత్వానికి కనువిప్పు కలిగిందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ చేపట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున జాతీయ, ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్‌తో పాటు టీఎంసీ, అన్నాడీఎంకే, శివసేన పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి రాష్ట్రంలో జరుగుతున్న నరమేధాన్ని తీవ్రంగా ఖండించారన్నారు. ధర్నా విజయవంతం కావడంతో చంద్రబాబు ప్రభుత్వం ఉలికిపాటుకు గురైందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా కూటమి నేతలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని పక్కనపెట్టడం అన్యాయన్నారు. అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు అప్పుగా ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పోలవరానికి సంబంధించి నిధులపై స్పష్టత ఇవ్వకున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏదో సాధించినట్లు చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం, రైల్వే జోన్, ఉక్కు పరిశ్రమ గురించి ప్రస్తావించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న, కూడేరు కన్వీనర్ జల్లిపల్లి రామచంద్రారెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

తాడిపత్రి అర్బన్/రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. గురువారం తాడిపత్రి అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లతో పాటు పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. తాడిపత్రిలో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల విషయంపై డీఎస్పీ కె.జనార్దన్ నాయుడుతో ఆరా తీశారు. రికార్డులతో పాటు స్టేషన్ ఆవరణలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వంటశాలలను పరిశీలించారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గంజాయి సరఫరాదారులు, విక్రయించే వారితో పాటు మూలాలపై ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్‌పై నిఘా ఉంచామని, వాటిని ఎవరు నిర్వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీ షీటర్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం మండలంలోని వీరాపురంలో పోలీసు పికెటింగ్‌ను ఆయన పరిశీలించారు. సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఏదీ ప్రత్యామ్నాయం?

- ప్రధాన పంటల సాగుకు ముగిసిన అదను
- జిల్లాలో ఇప్పటి వరకు 90 వేల హెక్టార్లలోనే పంటలు
- బీళ్లుగా రెండు లక్షల హెక్టార్లు
- సిద్ధం కాని ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక
- శ్రీ సత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి!

అనంతపురం అగ్రికల్చర్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నడుమ ఖరీఫ్ అతికష్టమ్మీద 'సాగు'తోంది. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధానపంటల సాగుకు అదను ఇప్పటికే ముగిసింది. వర్షం వస్తే నెలాఖరు వరకు వేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా.. ఈనెల 20 నాటికే సమయం ముగిసింది. 3.46 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేయగా... అరకొర వర్షాల నడుమ ప్రస్తుతానికి 90 వేల హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు వ్యవసాయశాఖ నివేదిక వెల్లడి చేస్తోంది. ఇంకా కొన్ని మండలాల నుంచి పూర్తి స్థాయిలో సాగు నివేదికలు రావాలని చెబుతున్నా.. లక్ష లేదా 1.10 లక్షల హెక్టార్లకు మించి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఎంతలేదన్నా ప్రత్యామ్నాయం కింద రెండు లక్షల హెక్టార్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా 2.89 లక్షల హెక్టార్లకు గానూ లక్ష హెక్టార్లలోనే పంటలు సాగులోకి రాగా ఇంకా 1.89 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయం అమలు చేయాల్సి ఉంది.

దృష్టి సారించని వ్యవసాయ శాఖ

జూలై 15 నాటికి వచ్చిన సాగు నివేదికల ఆధారంగా ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక (కంటింజెంట్ సీడ్ ప్లాన్) సిద్ధం చేయాల్సిన వ్యవసాయశాఖ ఇంకా ఆ దిశగా దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. దీనిపై ఆశాఖ అధికారులను వివరణ కోరగా, ఇదిగో అదిగో తయారు చేస్తున్నామని చెబుతున్నారు. అందుకు ఎన్ని క్వింటాళ్లు అవసరమనే దానిపై స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. వర్షాలు వస్తే కనీసం ఆగస్టు నుంచి తప్పనిసరిగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాల్సి ఉంటుంది.



నిరాశ పరిచిన జూలై..

జూలై వర్షాలు ఖరీఫ్‌ను బాగా నిరాశ పరిచాయి. జూన్ 15 వరకు విస్తారంగా వర్షాలు పడటంతో ఎంతో ఆశతో రైతులు ఖరీఫ్ సేద్యానికి దిగారు. అయితే, ఆ తర్వాత జూలై 15 పూర్తయినా రెయినీడేస్ కేవలం 12 రోజులకే పరిమితమయ్యాయి. గత 40 రోజుల్లో కేవలం ఒక రోజు మాత్రమే 2.6 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా కేవలం 19 మి.మీ నమోదైంది. అది కూడా తేలికపాటి తుంపర్లు, గాలి తెరలకే పరిమితమైంది. వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం వేరుశనగ 28 వేల హెక్టార్లు, కంది 20 వేల హెక్టార్లు, పత్తి 16 వేల హెక్టార్లు, ఆముదం 7,500 హెక్టార్లు, మొక్కజొన్న 4,500 హెక్టార్లు, సజ్జ 1,500 హెక్టార్లు, కొర్ర 1,200 హెక్టార్లు... ఇలా అన్ని పంటలు కలిపినా 90 వేల హెక్టార్లకు మించి సాగులోకి రాలేదు. ఇంకా 2 లక్షల హెక్టార్ల భూములు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా 35 శాతం విస్తీర్ణం లో పంటలు సాగులోకి రాగా, 65 శాతం ఖాళీగానే ఉంది. అందులో వేరుశనగ 65 వేల హెక్టార్లు, కంది 15 వేల హెక్టార్లు, మొక్కజొన్న 7 వేల హెక్టార్లు, పత్తి 1,800 హెక్టార్లు, ఆముదం పంట 1,600 హెక్టార్ల విస్తీర్ణంలో వేశారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉలవ, పెసర, అలసంద, కొర్ర, రాగులు తదితర విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన పరిస్థితి ఉంది. వ్యవసాయశాఖ కూడా తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి సాధ్యమైనంత తొందరగా ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే, గత రబీకి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ, గత ఖరీఫ్ పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ, గత ఖరీఫ్, రబీ పంటల బీమా కింద పరిహారం, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాను 'కుష్టు'రహితంగా మార్చాలి

అనంతపురం అర్బన్: జిల్లాను కుష్టువ్యాధి రహితంగా మార్చేందుకు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనపై గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టువ్యాధికి గురైన వ్యక్తులను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి నిర్మూలనలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకూ 15 రోజులపాటు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తోందన్నారు. వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వైద్య సదుపాయం అందించాలన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి సేవలు అందిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయమవుతుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈ.భ్రమరాంబదేవి, జిల్లా లెప్రసీ అధికారి అనుపమజేమ్స్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

అనంతపురంలో ఈడీ సోదాలు

- కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల గోల్‌మాల్ వ్యవహారం



అనంతపురం: కర్ణాటక రాష్ట్రంలో దుమారం రేపిన వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల గోల్‌మాల్ వ్యవహారానికి సంబంధించిన మూలాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దాదాపు రూ.88 కోట్లకుపైగా చేతులు మారాయన్న ఆరోపణల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర ఎస్టీ సంక్షేమం, యువజన సాధికారిత, క్రీడా మంత్రి బి. నాగేంద్ర ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఆయన వాల్మీకి అభివృద్ధి మండలి నుంచి అక్రమంగా నగదు బదిలీ చేసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నిధులను కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. మొత్తం 250 నుంచి 300 ఖాతాల్లోకి నగదు మారినట్లు తెలిసింది. ఈ అంశంపై ముంబై ప్రధాన కార్యాలయంగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీబీఐకి ఫిర్యాదు చేయగా, ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీనివాసులు పాత్రపై ఆరా

అనంతపురం నగరానికి చెందిన శ్రీనివాసులుకు కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు ఈడీ భావిస్తోంది. శ్రీనివాసులు భార్య సుమతి సురతాని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన బీజేపీ నేతతో కలిసి శ్రీనివాసులు అక్రమాలకి తెరతీశారనే ఆరోపణలతో ఈడీ అధికారులు బుధవారం అనంతపురం వచ్చారు. అనంతపురంలోని మారుతీనగర్‌లోని శ్రీనివాసులు ఇంట్లో రాత్రి పొద్దుపోయేవరకూ సోదాలు నిర్వహించారు. అనంతరం ఇంటిని సీజ్ చేశారు. గౌహతీలోని ఈడీ జోనల్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. గురువారం తిరుగు పయనం అయ్యారు.

డొల్ల కంపెనీల పేరుతో లూటీ

శ్రీనివాసులు అనంతపురం నగరంలో నివాసం ఉంటూ డొల్ల కంపెనీలను ఏర్పాటు చేయడం, వాటి మీద బ్యాంకు రుణాలు పొందడం, సబ్సిడీ తీసుకోవడం, కంపెనీ నష్టపోయినట్లు, లేదా ప్రమాదం జరిగినట్లు చూపించి రుణ ఎగవేతలో దిట్ట అని ఈడీ అధికారుల దృష్టికి వచ్చింది. డొల్ల కంపెనీల పేరుతో రుణాలు తీసుకుని కోట్లాది రూపాయలు అక్రమార్జనకు పాల్పడ్డారు. ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలి నిధులపై కన్ను పడింది. ఏకంగా రూ.88 కోట్ల మేర నిధులను దారి మళ్లించారు. ఇందులో కర్ణాటక మాజీ మంత్రి నాగేంద్రతో పాటు అనంతపురానికి చెందిన శ్రీనివాసులు పాత్రపై ఈడీ అధికారులు నిగ్గు తేల్చనున్నారు. శ్రీనివాసులకు సంబంధించిన ఆస్తులను ఈడీ జప్తు చేయనున్నట్లు తెలిసింది. మరో దఫా ఈడీ అధికారులు అనంతపురం రానున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా డొల్ల కంపెనీలు ఎన్ని సృష్టించారు? వాల్మీకి అభివృద్ధి మండలి నిధులను ఎన్ని డొల్ల కంపెనీలకు మళ్లించారు. ఇప్పటి దాకా డొల్ల కంపెనీల పేరుతో తెచ్చిన రుణాలను ఏ బ్యాంకు ఖాతాలకు మళ్లించారు. అసలు కంపెనీలు ఉన్నాయా? కంపెనీల స్థితిగతులను పరిశీలించారు. ఇదిలా ఉండగా, ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో శ్రీనివాసులు భార్య సుమతి సురతానికి మంచి నామినేటెడ్ పదవి తెచ్చుకోవాలనే ప్రయత్నాలు ఈడీ దాడులతో బెడిసికొట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

విజయవాడకు శింగనమల పంచాయితీ

- ఎమ్మెల్యేపై ద్విసభ్య కమిటీ సభ్యుల ఫిర్యాదు
- ఇప్పటికే బీకేఎస్‌లో తన్నుకున్న తెలుగుతమ్ముళ్లు

శింగనమల: నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య తలెత్తిన రేషన్ డీలర్ల పంచాయితీ విజయవాడకు చేరింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొన్ని రోజులుగా డీలర్‌షిప్ పంచాయితీలు నడుస్తున్నాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గీయులు, ద్విసభ్య కమిటీ సభ్యులైన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి వర్గీయులు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే శ్రావణి కార్యాలయం నుంచి బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయానికి కొత్త డీలర్లుగా వీరిని నియమించాలంటూ బుధవారం ఓ జాబితా రాగా, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకుని తమ పేర్లు లేవంటూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి దండువారిపల్లికి చెందిన టీడీపీ మాజీ మండల కన్వీనర్ ఆదినారాయణను ఓ వర్గానికి చెందిన నాయకులు కిందపడేసి కొట్టారు. ఈ క్రమంలో విషయాలన్నింటినీ ద్విసభ్య కమిటీ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన తమకు తమకు ఎమ్మెల్యే బండారు శ్రావణి ఏకపక్ష వైఖరి కారణంగా విలువ లేకుండా పోతోందని వాపోయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పలువురు ఎమ్మెల్యే వర్గీయలు కూడా గురువారం విజయవాడకు వెళ్లినట్లు తెలిసింది.

కొనసాగుతున్న అధిపత్య పోరు

నియోజకవర్గ టీడీపీలో చాలా రోజులుగా బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యుల మధ్య విభేదాలున్నాయి. గతంలో పార్టీకి సంబంధించి ఎవరికి వారుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించారు. నారా లోకేష్ పాదయాత్రలో గార్లదిన్నె వద్ద శ్రావణి తండ్రి రవికుమార్‌పై ముంటిమడుగు కేశవరెడ్డి వర్గీయులు దాడి చేశారు. నారా లోకేష్ ఇరువర్గీయులకు నచ్చజెప్పడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. ఆ తర్వాత శ్రావణి టికెట్ దక్కించుకోవడం, గెలవడం జరిగిపోయాయి. అయితే, ఎమ్మెల్యే అయ్యాక ద్విసభ్య కమిటీ సభ్యుల వర్గీయులను పూర్తిగా పక్కన పెట్టేశారు. నియోజకవర్గంలో రేషన్ డీలర్‌షిప్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు, గాలిమరల వద్ద సెక్యూరిటీ సిబ్బందిగా తన వర్గానికి చెందిన వారికే కట్టబెడుతుండడంతో మరో వర్గం రగిలిపోతూ ఉంది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం ఇరువర్గాలు రచ్చకెక్కి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నాయి. పోలీసుస్టేషన్‌లో పంచాయితీ పెట్టాయి. ఇదిలా ఉండగానే, ద్విసభ్య కమిటీ సభ్యులైన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి విషయాన్ని నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది.

మామిడి మొక్కల నరికివేత

కూడేరు: మండలంలోని మరుట్ల–2వ కాలనీ వద్ద గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన కౌసర్ బేగం సాగు చేసిన మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. తనకున్న 1.5 ఎకరాల పొలంలో రెండేళ్ల క్రితం ఆమె 60 మామిడి మొక్కలు నాటి సంరక్షిస్తూ వస్తున్నారు. గురువారం ఉదయం పొలం వద్దకు చేరుకున్న ఆమె 30 మొక్కలను నరికి వేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేమకల్లులో ఉద్రిక్తత

- ఫ్యాక్టరీల యాజమాన్యం.. రైతుల మధ్య ఘర్షణ

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల యజమానులు స్థానిక రైతులతో ఘర్షణ పడ్డారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా తమ పంటలు, పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ సీపీఐ, రైతు సంఘం నాయకులతో కలసి గత వారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మహేష్, వెంకటేశు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చారు. వీరితో పాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, నేమకల్లు బాధిత రైతులు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ఎండీలు, సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. సీపీఐ నేతలను చూడగానే ఒక్కసారిగా ఫ్యాక్టరీల ఎండీలు విరుచుకుపడ్డారు. ఇక్కడ మీకేం పని అంటూ వాగ్వాదానికి తెరలేపారు. ఆ సమయంలో బాధిత రైతులు వసికేరప్ప, రామాంజినేయులు కల్పించుకుని తమ పక్షాన నాయకులు వచ్చారని, ఈ విషయంగా ఎలాంటి వాదనలు వద్దని నచ్చచెప్పారు. దీంతో ఫ్యాక్టరీల సిబ్బంది కవ్వింపు చర్యలకు దిగారు.


రైతులతో వాగ్వాదం చేస్తున్న పరిశ్రమల నిర్వాహకులు

తోపులాటతో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయి దాటిపోతుండడంతో అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు. ఫ్యాక్టరీల ద్వారా వెలువడే కాలుష్యం కారణంగా పంట పొలాలు దెబ్బతినడమే కాకుండా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, అయినా ఫ్యాక్టరీ యజమానులకు ఏ మాత్రం పట్టడం లేదని ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ పరిహారం ఇవ్వాల్సి ఉన్నా... కేవలం రూ.2 వేలు మాత్రమే చెల్లిస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు.

ఎలుగుబంట్ల దాడిలో ఇద్దరికి గాయాలు

బ్రహ్మసముద్రం : మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం మొక్కజొన్న పంటకు నీరు పెడుతున్న రైతులు రవిచంద్ర, తిమ్మయ్యపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఆ సమయంలో వారి కేకలు విన్న చుట్టుపక్కల రైతులు అక్కడికి చేరుకుని ఎలుగుబంట్లను తరిమేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారిపై కూడా ఎలుగుబంట్లు దాడికి ప్రయత్నించాయి. అప్పటికే సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కర్రలు పట్టుకుని అక్కడకు చేరుకుని కేకలు వేయడంతో ఎలుగుబంట్లు బెదిరి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పరుగు తీశాయి. క్షతగాత్రులను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.


తీవ్రంగా గాయపడినరవిచంద్ర

పాము కాటుతో రైతు మృతి

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన రైతు పి.శ్రీనివాసరెడ్డి(45) పాము కాటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... తనకున్న రెండు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేసిన శ్రీనివాసరెడ్డి మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచన మేరకు వాడుతున్న మాత్రలు ప్రభావంతో విపరీతంగా నిద్ర వచ్చేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం మాత్రలు వేసుకుని పొలం వద్దకెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి తర్వాత పాము కాటు వేయడంతో వెంటనే నిద్ర మేల్కొని గమనించాడు. పక్క కింద నుంచి వేగంగా వెళ్లిపోతున్న పామును గమనించి చంపేసి, ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే నిద్ర ముంచుకు వస్తుండడంతో పాము కాటేసిన విషయం కుటుంబసభ్యులకు తెలపకుండానే పడుకున్నాడు. గురువారం వేకువ జామున ఆయన నోటి నుంచి నురగ వస్తుండడం గమనించిన సోదరులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్రాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందడంతో వివాహం చేసుకోకుండా ఒంటరిగానే ఉంటున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మృతుడు శ్రీనివాసరెడ్డి

టీడీపీ నేతల వేధింపులు తాళలేక పోతున్నా...

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి టీడీపీ నాయకుల వేధింపులకు అడ్డు అదుపు లేకుండా పోతోందని కళ్యాణదుర్గం మండలం పాత చెరువు గ్రామానికి చెందిన పూర్వ వలంటీర్ లింగన్న వాపోయాడు. రెండు నెలలుగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చంద్రప్ప, రమేష్... తనను నిత్యమూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాము అనుకుంటే చంపి పారేస్తామని బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో గురువారం కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు.


బాధితుడు లింగన్న

మేజర్ పంచాయతీ అభివృద్ధికి చర్యలు


వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ ప్రభాకర్‌రావు

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం బీకేఎస్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సెక్రటరీ సాదిక్ వలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహం

అనంతపురం సిటీ: నగర పరిధిలోని హెచ్చెల్సీ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (42) మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అనంతపురం సెంట్రల్: ప్రతి వాహనదారుడూ రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు చోటు చేసుకుండా ఉంటాయని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ అన్నారు. గురువారం ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, అతికనాజ్, ఏఎంవీఐలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిసెంట్ల రాజీనామాకు ఒత్తిడి

కుందుర్పి: విధుల నుంచి తప్పుకోవాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఓబిరెడ్డి ఆదేశించారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులే తమతో బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారంటూ ఫీల్డ్ అసిసెంట్లు ముకుంద, వీరాంజి, గురుమూర్తి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

సేవాలాల్ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయండి

గుత్తి రూరల్/ఉరవకొండ: మండలంలోని సేవాగఢ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రూ.50 లక్షలు మంజూరు చేయాలంటూ సీఎం చంద్రబాబుకు మంత్రి పయ్యావుల కేశవ్ విన్నవించారని సేవాలాల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవనాయక్ గురువారం తెలిపారు. వచ్చే ఏడాది జరిగే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు సౌకర్యాలు, రవాణా, భోజనాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు అవశ్యకత ఉందని సీఎం దృష్టికి మంత్రి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలి విధులతో రెండు జిల్లాల డీఈఓల చెలగాటం

అనంతపురం ఎడ్యుకేషన్: రెండు జిల్లాల విద్యాశాఖ అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలకు రెండు నెలలుగా జీతం అందక ఓ సామాన్య టీచరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ టీచరుగా పని చేస్తున్న ఎం.శివమాధవి... 2022, నవంబరులో ఆ జిల్లా సమగ్రశిక్ష అసిస్టెంట్ జీసీడీఓగా వెళ్లారు. అయితే వ్యక్తిగత కారణాలు పేర్కొంటూ తనను రిలీవ్ చేయాలని ఈ ఏడాది మేలో సమగ్ర శిక్ష ఏపీసీకి విజ్ఞప్తి చేశారు. ఈ ఫైల్‌ను పరిశీలించిన అప్పటి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆమెను రిలీవ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఆ జిల్లా డీఈఓ మీనాక్షి మే 16న (ఎన్నికల కోడ్ అమలులో ఉంది) శివమాధవిని రిలీవ్ చేశారు. దీంతో నిబంధనల మేరకు తనకు పోస్టింగ్ కల్పించాలంటూ పూర్వపు జిల్లా డీఈఓ వరలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ ద్వారా ఫైల్ పెట్టించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రిలీవ్ చేయడం... ఆ సమయానికి జీతం ఎలా చేయాలి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ ఫైల్‌ను అనంత డీఈఓ వరలక్ష్మి వెనక్కు పంపారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు ఆ జిల్లా డీఈఓ కార్యాలయంలో శివమాధవి రిపోర్ట్ చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో జూన్ 27న డీఈఓ వరలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి లేఖ రాశారు. శివమాధవి తమ కార్యాలయానికి రోజూ విధులకు హాజరవుతున్నారని, అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఆమెకు పోస్టింగ్ కల్పించాలంటూ అందులో పేర్కొన్నారు. కానీ పూర్వపు డీఈఓ వరలక్ష్మి ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ శివమాధవికి పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, ఈ అంశంపై వివరణ కోరేందుకు రెండు జిల్లాల డీఈఓలను సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించినా వారి నుంచి స్పందన లేకుండా పోయింది.

హత్య కేసులో 10 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం: మండలంలోని మెచ్చిరిలో ఈ నెల 9న హత్యకు గురైన కొత్తపల్లి ఆదికేశవులు అలియాస్ ఆదెప్ప కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను సీఐలు శ్రీనివాసులు, ప్రసాద్ బాబుతో కలసి కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు గురువారం వెల్లడించారు. పాతకక్షలే ఆదెప్ప హత్యకు కారణంగా నిర్ధారణ అయిందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కేశిరెడ్డి ఇప్పటికే కోర్టులో లొంగిపోయి జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్నాడన్నారు. అలాగే ఈ కేసుతో సంబంధం ఉన్న కాపు చంద్రశేఖర్‌రెడ్డి, గురికారి నవీన్, నామాల చంద్రశఖర్‌రెడ్డి, మూడముళ్ల ఆంజనేయులు, కాపు అచ్చిరెడ్డి, నామాల సందీప్‌రెడ్డి, కోళ్ల శ్రీకాంత్‌రెడ్డి, మూడముళ్ల మారుతి, కాపు మహేష్, కాపు శ్యామరాజుని గురువారం అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఐదు కొడవళ్లు, కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఆదెప్ప, కాపు చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయుల మధ్య గ్రామంలో కొంతకాలంగా విభేదాలు నెలకొన్నాయన్నారు. ఏడాదిన్నర క్రితం గడ్డి దొడ్డి ఏర్పాటు విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. అప్పట్లో ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయన్నారు. అప్పటి నుంచి రెండు వర్గాల మధ్య వైరం మరింత ముదిరిందన్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఆంజనేయ స్వామి అర్చకులుగా పనిచేస్తూ గ్రామస్తుల ఆగ్రహానికి గురై వైదొలిగిన పూజారి హనుమంతరాయుడు, సత్యనారాయణ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదెప్పను ఆశ్రయించారు. ఎలాగైనా తమకు అర్చకత్వ హక్కులు ఇప్పించాలని కోరారు. దీంతో ఈ నెల 6న ఆదెప్ప అండతో అర్చకత్వ బాధ్యతలు తీసుకున్నారు. ఈ అంశం విభేదాలను మరింత రగిలించింది. దీంతో కక్ష కట్టిన నిందితులు ఈ నెల 9న కాపు కాచి ఆదెప్పను హతమార్చినట్లుగా దర్యాప్తులో నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ఏ శిశువు జన్మిస్తూ మరణించకూడదు. ఏ తల్లీ... బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదు. మాతాశిశు మరణాలు పూర్తి స్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలి' అని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జూన్ వరకు చోటు చేసుకున్న 17 మాతృ మరణాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కారణాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. నమోదైన 17 మాతృ మరణాల్లో ఆరు కేసులను తీవ్రంగా పరిగణిస్తూ వివరణ కోరారు. మరణాల నివారణకు చేపట్టిన చర్యలను డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... మరణానికి ఉన్న మూల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఎలాంటి కారణంతోనైనా మరణం సంభవించకుండా వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం తర్వాత బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేకం శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు, మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. మాతృ మరణం జరిగినప్పుడు నోడల్ టీమ్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర విచారణ చేయాలన్నారు. గర్భిణిని 12 వారాల్లోగా రిజిస్టర్ చేయడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రమాదకర లక్షణాలుంటే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సుఖ ప్రసవం జరిగేలా చూడాలని చెప్పారు. ఏ తల్లి ప్రసవం తరువాత అధిక రక్తస్రావంతో మరణించకూడదన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డీఐఓ యుగంధర్, వైద్యులు నవీన్‌కుమార్, లక్ష్మన్న, హేమలత, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు వద్ద డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఉద్యాన పంటల సాగు ప్రోత్సహించాలి

ఆత్మకూరు: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా పని చేయాలని ఉద్యాన శాఖ అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆత్మకూరు మండలం పాపంపల్లి, ఆత్మకూరు, సిద్దరాంపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. పాపంపల్లిలో రమేష్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న ఫారంపాండ్‌ను పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటకు నీరు అందించడంలో తలెత్తే ఇబ్బందులపై ఆరా తీశారు. ఆత్మకూరులో రైతు ధనుంజయరెడ్డి సాగు చేసిన దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ పంటలను పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు విధానాలు, దిగుబడులు, మార్కెటింగ్ తదిరత అంశాలను అడిగి తెలుసుకున్నారు. మరో రైతు అమరసింహ సాగు చేసిన బీర పంటను పరిశీలించారు. సిద్దరాంపురంలో రమేష్‌నాయుడు సాగు చేసిన అంజూర పంటను పరిశీలించారు. అనంతరం ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయంపై రైతులతో కలెక్టర్ ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఉద్యాన రైతులకు సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, డ్రగ్స్ ఏడీ రమేష్‌రెడ్డి, రత్నకుమార్, సుచరిత పాల్గొన్నారు.

పాతిపెట్టిన మృతదేహం వెలికితీత

శెట్టూరు: పాతిపెట్టిన మృతదేహాన్ని 12 రోజుల తర్వాత వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు... శెట్టూరు మండలం అడవిగొల్లి గ్రామానికి చెందిన హరిజన సువర్ణమ్మ (27)కు చింతర్లపల్లి గ్రామానికి చెందిన పూజారి బాబుతో ఏడేళ్ల కిత్రం వివాహమైంది. ఈ నెల 14న చింతర్లపల్లిలోని తన ఇంట్లో సువర్ణమ్మ ఉరి వేసుకోవడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను శెట్టూరులోని పీహెచ్‌సీకి అనంతరం కళ్యాణదుర్గం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆ మరుసటి రోజు చింతర్లపల్లి శ్మశాన వాటికలో సువర్ణమ్మ మృతదేహాన్ని భర్త పూజారి బాబు, మృతురాలి తల్లిదండ్రులు దుర్గమ్మ, గోపాల్ తదితరులు ఖననం చేశారు. అయితే సువర్ణమ్మ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతురాలి అక్క, భాగ్యమ్మ భర్త శివశంకర్ డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


సువర్ణమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

దీంతో మృతురాలి తల్లి దుర్గమ్మతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ రాంభూపాల్ సమక్షంలో సువర్ణమ్మ మృతదేహాన్ని వెలికి తీయించి డాక్టర్ శంకర్‌నాయక్ పోస్టుమార్టం చేశారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్


విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏజీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. విద్యార్థులకు విద్య, క్రీడా సామగ్రితో పాటు పిచ్చుక గూళ్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా ప్రభుత్వం తరఫున అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి పని ప్రభుత్వమే చేపట్టాలని ఎదురు చూడకూడదని, సేవా దృక్పథంతో ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు అనవసరంగా సౌండ్ హారన్ కారణంగా చాలా మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్ ఏజీఎస్ ఫౌండేషన్ ప్రమీలమ్మ, అనిల్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, ఏడీఏ లక్ష్మీప్రసన్న, పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మేయర్ వసీంకు మరోసారి అవమానం

తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులపై జిల్లా అధికార యంత్రాంగం చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో జరిగే కార్యక్రమాల్లో కచ్చితంగా ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ పాటించాల్సి ఉంది. కానీ గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో జరిగే ఓ స్వచ్ఛంధ సంస్థ కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్ వసీంను ఈ కార్యక్రమానికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఒక వేళ ప్రైవేట్ కార్యక్రమమైనా..ప్రభుత్వ పాఠశాలలో జరిగే కార్యక్రమానికి తప్పక ప్రథమ పౌరుడికి ఆహ్వానం ఇవ్వాల్సి ఉంది. గత కమిషనర్ మేఘ స్వరూప్ కూడా ఓ కార్యక్రమానికి మేయర్‌ను ఆహ్వానించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల పట్ల జిల్లా అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న యూనివర్సిటీ ఆఫ్ ఐజూ (జపాన్) అసోసియేట్ ప్రొఫెసర్ ఒగవా యోషికా

అనంతపురం రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యూనివర్సిటీ ఆఫ్ ఐజూ (జపాన్) అసోసియేట్ ప్రొఫెసర్ ఒగవా యోషికా అన్నారు. గురువారం పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అంతర్గత నాణ్యత హామీ సెల్ ఆధ్వర్యంలో నిపుణుల ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒగవా యోషికా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. సరికొత్త పరిశోధనలు చేస్తూ విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

ఐఓబీ ఆధ్వర్యంలో రుణమేళా


మెగా చెక్కును అందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో విద్యుత్‌నగర్ సర్కిల్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 3.51 కోట్లు రుణాలను అందించారు. మొత్తం 18 ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు అందించినట్లు బ్యాంకు మేనేజర్ అనిష్ తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కౌలురైతులకు సీసీఆర్‌సీలు


మాట్లాడుతున్న రూరల్ ఏఓ ఆర్.శశికళ

అనంతపురం అగ్రికల్చర్: అర్హత కలిగిన కౌలు రైతులకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సీసీఆర్‌సీ) అందిస్తామని రూరల్ మండల వ్యవసాయాధికారి ఆర్.శశికళ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొడిమి, నారాయణపురం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. స్వంత భూమి లేని రైతులు తోటి రైతుల నుంచి కౌలుకు తీసుకున్న వారికి 11 నెలల అగ్రిమెంట్‌తో సీసీఆర్‌సీ ఇస్తామన్నారు. దీని వల్ల సదరు రైతులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. స్వంత భూమి సాగుదారులకు ఎలాంటి ఇబ్బంది నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏఈఓ మురళీకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కనగానపల్లి: వ్యవసాయ పొలాలకు అందించే విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న కోతలు, సమస్యలు పరిష్కరించాలంటూ మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ ముందు గురువారం రైతులు ఆందోళన నిర్వహించారు. మండలంలో మండలంలోని చంద్రశ్చర్ల, దాదులూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను సిబ్బందికి తెలిపారు. మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని దాదులూరు ఫీడర్ కింద ఉన్న గ్రామాల వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా సక్రమంగా కావటం లేదని వాపోయారు. అయితే సిబ్బంది స్పందించకపోవడంతో సబ్‌స్టేషన్ ముందు ఉన్న రహదారిపై ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఏడీ నాగేంద్ర, ఏఈ జీనాద్ రైతులతో మాట్లాడారు. గాలి కాలంలో విద్యుత్ లైన్లు సరిగా నిలవకపోవటంతో విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతోందన్నారు. చర్యలు చేపట్టి బోరుబావులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే


పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక రామచంద్రనగర్‌లోని సెయింట్ అగస్టీన్ పాఠశాలలో గురువారం ఘనంగా 'గ్రాండ్ పేరెంట్స్ డే' జరుపుకున్నారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థులు 'తల్లిదండ్రులు లాంటి వారే అవ్వా తాతలు' అంటూ చక్కని నాటకాన్ని ప్రదర్శించారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో 591 మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థిని సమ్రిన్‌తాజ్, ఆమె తల్లిదండ్రులను ఈ సందర్భంగా సత్కరించారు. హెచ్‌ఎంసుజాత, ఏఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షిద్దాం, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 2వ డివిజన్‌లోని కల్పనాజోషీ కాలనీలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ వసీం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా మొక్కలు నాటుతామని చెప్పడం చాలా అభినందనీయమన్నారు. ప్రజలు అడిగిన వెంటనే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను సరఫరా చేశామన్నారు. అనంతరం స్థానిక ప్రజలు తాగునీటి పైప్‌లైన్ కావాలని మేయర్ వసీంకు విజ్ఞప్తి చేయగా పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఈ చంద్రశేఖర్‌ను మేయర్ ఆదేశించారు. కాలనీలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

రేపటి నుంచి వార్షికోత్సవ వేడుకలు


మాట్లాడుతున్న రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: వివేకానంద భావప్రచార పరిషత్తు అనుబంధ సంస్థ శ్రీరామకృష్ణ సేవా సమితి 20 వార్షికోత్సవ వేడుకలు శనివారం నుంచి 13 రోజుల పాటూ ఘనంగా జరగనున్నాయి. గురువారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు వివరాలు తెలియజేశారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత ప్రవచన కర్త షణ్ముఖశర్మ 'శివసాక్షాత్కారం ' అనే అంశంపై ప్రవచనం ఇవ్వడానికి ఈనెల 27న అనంతకు రానున్నారు. అలాగే ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం శివపదం నృత్యరూపకం ప్రదర్శిస్తారు. స్థానిక మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలులో ప్రవచనం ఏర్పాటు చేశారు. ఈనెల 31న సాయిట్రస్టు ఆధ్వర్యంలో గిరిజా కల్యాణం జరుగుతుంది. ఆగస్టు 1 నుండి వివిధ విద్యాలయాలలో యువజనోత్సవాలను నిర్వస్తారు. వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమితి నిర్వాహకులు కోరారు.

ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి ఎదగాలి


ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు అందించిన దృశ్యం

ఆత్మకూరు: ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని కర్నూలు మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ భవానీ ప్రసాద్ తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ యేడాది కూడా గురువారం ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదివానని, తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి ఉన్నతస్థాయికి చేర్చారన్నారు. చదివిన పాఠశాలకు, ఉన్న ఊరికి, కన్నతల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. అనంతరం పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన శివసాయికి రూ.10 వేలు, అజయ్‌కు రూ.7 వేలు, అన్వేష్‌కు రూ.5 వేలను బహుమతిగా అందజేశారు. అదేవిధంగా గతంలో ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసిన శ్రీదేవి ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమానం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసప్రసాద్, ఉపాధ్యాయులు గురురాజ్, రామాంజనేయులు, శ్రీనివాసమూర్తి, మల్లేసిరెడ్డి, నారాయణస్వామి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై పోరుకు సిద్ధం కావాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పట్టించుకోవడం లేదని ఏపీ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆగస్టు 9న చేపట్టనున్న చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల చేశారు. ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి మంత్రి సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు గురువారం ఉచితంగా నోటుబుక్కులను పంపిణీ చేశారు. సత్యసాయిబాబా భక్తుడు సాయి శివానంద హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయుడు నాగభూషణ, చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతవాసులకు అత్యున్నత పురస్కారాలు


భరత్


జీవన్‌కుమార్

అనంతపురం కల్చరల్: ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందజేసే డిజిటల్ ఇండియా, మై గవర్నమెంట్ సాథీ పురస్కారాలకు జిల్లాకు చెందిన సామాజిక సేవా కార్యకర్తలు బిసాతి భరత్, జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఇద్దరూ గతంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో పని చేస్తూ మరోసారి పురస్కారాలకు ఎంపికైన వారు శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందుకోనున్నారు. ఈ సందర్భంగా భరత్, జీవన్‌కుమార్‌ను నెహ్రూ యువకేంద్రం అధికారులు మణికంఠ, శ్రీనివాసులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ రమేష్ అభినందించారు.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి

- మునిసిపల్ ఆర్‌డీ, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి


ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: 'రానున్న వినాయక చవితి పండుగకు ప్రజలు మట్టి విగ్రహాలను వాడేలా ప్రోత్సహించాలి. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలి' అని మునిసిపల్ ఆర్‌డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్లాస్టిక్‌తో తయారు చేసి విగ్రహాలను నిషేధించాలన్నారు. మట్టి విగ్రహాల ఏర్పాటుతో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వర్షాకాలంలో నగరంలోని నడిమివంక, మరువవంకలో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంకలో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలన్నారు. వాటి పురోగతి ఏవిధంగా ఉందని ఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనధికార నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ మారుతీహరిప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో ఈఈ సుధారాణి, డీఈలు చంద్రశేఖర్, దాక్షాయని, సుభాష్ చంద్రబోస్, రవీంద్ర రెడ్డి, ఏడీఏ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని సాయినగర్, అశోక్‌నగర్, రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వైర్‌లెస్ సెట్లు ప్రతి ఒక్కరు వాడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

కాలువల్లో ప్లాస్టిక్ వేస్తే ఎలా?

కాలవల్లో ప్లాస్టిక్‌ను గుట్టగుట్టలుగా వేస్తే ఎలాగని, మరోసారి ప్లాస్టిక్‌ను కాలువలో వేస్తే షాపును సీజ్ చేస్తానని ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి వ్యాపారులను హెచ్చరించారు. గురువారం జనశక్తి నగర్‌లో ఈఈ సూర్యనారాయణతో కలసి ఆయన పర్యటించారు. పెద్ద కాలువలో సోఫాసెట్లకు వినియోగించే రెగ్జిన్, తదితర ప్లాస్టిక్‌ను డంప్ చేయడాన్ని చూసిన ఆయన వ్యాపారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనంతరం అక్కడి వ్యాపారులకు ఆయన నోటీసులు జారీ చేశారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు మెరుగైన సేవలందిస్తాం


మాట్లాడుతున్న కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ట్రాన్స్‌జెండర్స్‌కు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రిలోని ఏపీజీడీఏ హాల్‌లో ట్రాన్స్‌జెండర్ ఆరోగ్య సమస్యలపై జీజీహెచ్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌కు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఓపీను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలున్నా..వారు నిర్భయంగా తెలియజేయవచ్చని డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత పేర్కొన్నారు.

కుష్బూ కొఠారిని సస్పెండ్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: విద్యార్థి సంక్షేమం గాలికి వదిలేసి అక్రమాలకు పాల్పడుతున్న బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి పృథ్వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కుష్బూ కొఠారి ... వాల్మీకి జయంతి ఉత్సవాల్లో రూ.10 లక్షలు చేతివాటం చూపిందన్నారు. దానిపై సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఆత్మకూరు: శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయు తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. నృత్య ప్రదర్శన, పాటల పోటీలు, నాటిక ప్రదర్శనలు నిర్వహించామన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులను ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు.

'హరిత అనంత'లో వ్యవసాయశాఖ


మొక్క నాటుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డీడీఏ మద్దిలేటి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం హరిత అనంత చేపట్టారు. స్థానిక జిల్లా వనరుల కేంద్రం (రైతు శిక్షణా కేంద్రం) ఆవరణలో డీడీఏ మద్దిలేటి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ హాజరై మొక్కలు నాటారు. మొక్కలు నాడటంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శైలజాకుమారి, ఓబుళపతి, హైమావతి, శ్రీనివాసులు, శంకరలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు అర్హులైన టీచర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు డీఈఓ వరలక్ష్మి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు సెట్ల దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలకు అందజేయాలి. కనీసం 15 ఏళ్ల బోధన అనుభవం కలిగి, గతంలో జిల్లాస్థాయిలో ఉత్తమ టీచరు అవార్డు పొందిన వారు అర్హులు. దరఖాస్తుదారుడిపై ఎలాంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అదుకున్న వారు అనర్హులు.

సాహితికి డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్స్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేసిన డి.సాహితీకి గురువారం డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ జీ. కెజియారాణి పర్యవేక్షణలో ' డిజైనింగ్ ఈఎఫ్ఎస్‌సీ అల్గారిథం ఫర్ హైబ్రిడ్ ఫ్రాగ్‌మెంటేషన్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ డేటాబేసెస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

శిక్షణ పూర్తి చేసిన వారికి సన్మానం

అనంతపురం క్రైం: ఆర్టీసీలో ఉచితంగా హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులను గురువారం ఆర్టీసీ అధికారులు సన్మానించారు. పలు బ్యాచ్‌ల్లో 16 మంది డ్రైవరు శిక్షకులకు ఉపాధి చూపాలన్న లక్ష్యంతో కియా సహకారం అందించిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లను ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో సన్మానించారు.

పేదలకు పట్టాలిచ్చి ఆదుకోండి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ టీవీ టవర్ వెనకాల 194/8 సర్వే నంబర్‌లో 600 మంది పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఆదుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఆర్వీ నాయుడు , ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

28న జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ఆత్మకూరు: ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని సెయింట్‌జోన్స్ పాఠశాల మైదానంలో సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి అమరేంద్రయాదవ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2008, ఏప్రిల్ తర్వాత జన్మించిన వారు అర్హులు. పూర్తి సమాచారానికి 90146 89895లో సంప్రదించవచ్చు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు వీధుల్లో పీర్లస్వాములు ప్రత్యేక పూజలందుకుంటున్నారు. స్థానిక నాల్గవరోడ్డులో గురువారం రాత్రి చిన్న సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద పీర్ల మకాన్‌లో కొలువుదీరిన హజరత్ దూద్ పీర్‌వలి, హజరత్ అక్బర్‌వలి పీర్ల వద్ద భక్తులు బారులు తీరి చెక్కెర చదివింపులు చేశారు. అలాగే ఐదో రోడ్డులోని బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి.